

# శీనూ...! నన్ను క్షమించు!!

జగన్నాథ శర్మ

కృష్ణరాయపురం స్టేషన్ వదిలి, రైలు వేగాన్ని పుంజుకుంది. రానున్నది అగ్రహారం రోడ్డు. పది, పదిహేను నిమిషాల్లో చేరుకుంటానక్కడికి. అగ్రహారం రోడ్డుకి చేరుకోబోతున్నాను అనిపించగానే ఏదో చెప్పలేని ఆనందం.... దాంతో సీట్లో కూర్చోవాలనిపించలేదు. లేచి, కంపార్ట్‌మెంట్ డోర్ దగ్గరగా వచ్చి నిలుచున్నాను. చలి కాలమేమో!చలి గాలి రివ్వు రివ్వున వచ్చి శరీరాన్నంతా చుట్టేసింది. టైమెంతయి ఉంటుంది? చేతి వాచీకేసి చూశాను. అయిదవుతోంది. అయినా ఇంకా చీకటి చీకటిగానే ఉంది.

''రారా! స్టేషన్ వచ్చేస్తోంది'' అరిచారెవరో. చూశాను. అరిచినతనికో నలభై ఏళ్ళుంటాయి. ఓ చేతిలో సూట్‌కేసు, ఇంకో చేతిలో బ్యాగు ఉంచుకుని భార్యని అనుకుంటాను, కేకేశాడతను.

''వచ్చే! వచ్చే'' నిద్రపోతున్న ఏడాది పాపని చంకనేసుకుని అతని దగ్గరగా వచ్చిందామె.

''మీ తమ్ముడు స్టేషన్‌కి వస్తానన్నాడు. వస్తాడా?'' అడిగాడు భర్త.

''వస్తానంటే వస్తాడు. మీ తమ్ముళ్ళా కాదు'' అని నవ్విందామె. ఆమె నవ్వుకి అతనికి కోపం వచ్చిందేమోగాని, నాకయితే నవ్వొచ్చింది. వాళ్ళు చూడకుండా నవ్వుకున్నాను.

''మీరెక్కడ దిగాలి సార్'' నన్నడిగాడతను. 'డోర్‌కి అడ్డంగా తప్పుకో' అని అసలు ఉద్దేశం.

''అగ్రహారం రోడ్డు '' అన్నాను.

''మాతో పాటే'' నవ్వాడతను.

''అవును'' అన్నాను.

''ఎక్కడికెళ్ళాలి సార్'' అడిగిందామె.

''అగ్రహారానికి'' చెప్పాను.

''కార్తీక మాసం కదా! శివాలయానికి అనుకుంటాను'' అందామె. అవును, కాదని నేను అనలేదు. నవ్వి వూరుకున్నానంతే!

అగ్రహారం రోడ్డు వచ్చేసింది. రైలింకా ఆగనేలేదు, నన్ను తోసుకుని ఆ భర్తగారు దిగితే, పాపం ఆ భార్యామణి రైలాగిన తర్వాత నా చేయి పట్టుకుని జాగ్రత్తగా దిగింది. ''రారా'' అరుస్తూ వెళ్ళిపోతున్నాడతను. ఆమె పరుగందుకుని, భర్త వెంట పడింది. సీట్లో ఉన్న బ్రీఫ్‌కేసందుకుని, నేనూ రైలు దిగాను. ప్లాట్ ఫారం మీద ఇలా అడుగు పెట్టానో లేదో ఏంటో ఎక్కడలేని సంతోషం కలిగింది. ఆగినంత సేపు పట్టలేదు, అంతలోనే రైలు వెళ్ళిపోయింది. కనుమరుగయ్యేంత వరకు రైలుని చూసి, తర్వాత చుట్టూ పరికించి చూశాను. ఒకప్పుడు ఇటొకటే ప్లాట్ ఫారం! ఇప్పుడు అటు కూడా ఇంకొకటి వచ్చింది. బ్రిడ్జి కూడా వచ్చింది. సిమెంట్ బెంచీలు, చెట్లూ...బాగుందంతా.

''బాబూ! అగ్గురోరానికేటి'' అడిగాడతను. అతను ఆటో డ్రైవరో లేదంటే టాక్సీ డ్రైవరో అయివుంటాడు.

''అవును'' అన్నాను.

''రండి మరి'' అని నా చేతిలోని బ్రీఫ్‌కేసందుకున్నాడు. అతన్ని అనుసరించాను. అతను ఆటో డ్రైవరే! తన ఆటో దగ్గరగా నన్నతను తీసుకొచ్చాడు. ఆటో ఎక్కి 'పోనీయ్' అన్నాను.

''బాబూ! తమరేటనుకోనంటే ఇంకో ఇద్దరిని ఎక్కించుకుంటాను'' అడిగాడతను.

''నీ ఇష్టం'' అన్నాను. 'అగ్గురోరం! అగ్గురోరం' కేకేశాడతను. ఎవరూ రాలేదు.

''మరేటి సేస్తాం! పదండి'' అంటూ ఆటోని పోనిచ్చాడతను.

బస్టాండ్ దాటాం. నెహ్రూ మార్కెట్ దాటాం. రాజు గారి కోట దాటాం. కొత్త పేట దాటాం. దాటి, చెరువు గట్టు మీంచి ప్రయాణిస్తోంటే ఆ తెలి చలి వేళ సరదా సరదా అనిపించింది. అదిగో అగ్రహారం! వచ్చేసిందొచ్చేసిందనుకుంటుండగానే అగ్రహారం వచ్చేసింది.

''ఎక్కడ దిగుతారు బాబూ'' ఆటోవాలా అడిగాడు.

''శివాలయానికి పోనీయ్'' అన్నాను. ఆటో శివాలయం దగ్గర ఆగింది. మీటర్ చూసి ''ఓ వందివ్వండి బాబూ'' అడిగాడు ఇచ్చాను. ''థాంక్యూ సార్'' అని వెళ్ళిపోయాడు ఆటోవాలా. ఆలయం దగ్గర నేను ఒక్కణ్ణే ఉన్నానిప్పుడు. తెల్లగా తెల్లారి పోయింది. అయినా అగ్రహారం ఇంకా మేలుకో లేదు. చలికి చుట్టుకుని ఉందింకా. ఆలయం తొలి మెట్టు మీద నిల్చుని ఉన్నాను. పైకి చూస్తే మిగిలిన తొమ్మిది వందల తొంభై ఎనిమిది మెట్లూ అలా అలా మంచులో తడుస్తూ కనిపిస్తున్నాయి. వెయ్యో మెట్టు ఆలయం. అంతెత్తున ఆలయం కనీకనిపించకుండా ఉంది. పొగ మంచులో కూరుకుపోయింది. మెట్లెక్కడం ప్రారంభించాను. ఒకటి, రెండు, మూడు...లెక్క పెడుతున్నాను. వందో మెట్టు దగ్గరికి వచ్చాను. సాక్షి గణపతి దర్శనమిచ్చాడు. నమస్కరించి, దగ్గరి కోనేటికి బయల్దేరాను. కోనేట్లో స్నానం చేస్తోంటే చలి అని




పించలేదు సరికదా ఏదో గిలిగిలి! కస్తూరి జ్ఞాపకా నికొచ్చింది. కస్తూరితో ఈ కోనేట్లో ఎన్నిసార్లు సరిగంగ స్నానాలు చేశానో! ఎన్ని తామర పువ్వులు తెంచి తనకి ఇచ్చానో! 'శీనూ! జాగ్రత్త' అనేది కస్తూరి. 'ఏం పర్వాలేదు' అనేవాణ్ణి నేను. ఆనాటి ధైర్యం ఇప్పుడూ ఉందనిపించి రెండు బారల్లో ముందుకురికాను. అదిగదిగో తామర పువ్వు! అందుకోబోయాను. అంతలోనే ఏమ యిందో ఏమో! కోనేటి అడుక్కి జారిపోసాగాను. పట్టు సడలి, శక్తి సన్నగిల్లుతోంది. నీళ్ళు తాగేస్తు న్నాను. ఊపిరి ఆడడం లేదు. ప్రమాదం పొంచి ఉన్నట్టు అనిపించింది. ఇంతలో 'శీను! శీను!' అంటూ ఆందోళనగా కేకలు వినిపించాయి. కస్తూరి నన్ను పిలుస్తోంది. అంతే! ఒక్కసారిగా ఏనుగంత బలం వచ్చింది. శక్తినంతా కూడదీసుకు న్నాను. 'సర్'న పైకి లేచాను. ప్రాణాలు వొడిసి పట్టుకుని చూశాను. ప్రమాదం తప్పింది గాని, కోనేట్లోగాని, కోనేటి గట్టున గాని కస్తూరి కని పించలేదు. అంతా భ్రమ! నా ఆశ! ఆశయితే అయిందిగాని, బతికి బట్టకట్టాను. కస్తూరికి మన సులోనే 'థాంక్స్' చెప్పాను.

ఉదయం ఆరున్నర గంటలయింది. అయినా ఆలయానికి ఇంకా ఎవరూ రాలేదు. అప్పట్లో ఇలా ఉండేదా? కార్తీక మాసం అంటే కోడి కూతకే అంతా ఆలయానికి వచ్చేవారు. పూజలు, పున స్కారాలు... ఓహో! ఎంత హడావుడి! ఆ రోజులే వేరనిపించింది. చెట్టు కింద పడ్డ గన్నేరు పూలు, ఎలా పడ్డవి అలాగే వున్నాయి. తీసేందుకు పిల్లలు లేరు. కొట్టుకోడాల్లేవు. బాధనిపించింది. వెళ్ళి గన్నేరు పూవుల్ని దోసిట పట్టి, ముందుకు నడి చాను. అప్పుడు కనిపించారు పూజారిగారు. ఏళ్ళు పైబడడంతో బాగా ముసలితనంతో కనిపిం చారు. నడవలేక నడవలేక నడిచొస్తున్నారాయన.

''నమస్కారం పూజారి గారు'' పూజారి గారికి నమస్కరించాను.

''నమస్కారం'' అన్నారాయన. నన్నాయన పోల్చుకోలేదు. అందుకే నన్ను పెద్దగా పట్టించు కోక వెళ్ళిపోయారు. పిలిచి, నేనెవరో చెబుదామని పించింది. కాని ఎందుకో వూరుకున్నాను. కుమార స్వామి గుడి దగ్గరగా వచ్చాను. స్వామికి ధూప, దీపాలు కరువైనట్టున్నాయి. గుడి అంతా వెలవెల పోతోంది. ప్రధాన ఆలయానికి స్వామి గుడి కాస్తంత దూరంలో వుంటుంది. ఆ దూరం కుర్రకారుకి కలిసొచ్చేది. కస్తూరి నా కోసం ఇక్కడే కాపు కాచేది. నేను రావడం ఆలస్యం అయితే చాలు! ఇంతెత్తున ఎగిరేది. గన్నేరు కాయలుచ్చుకుని కొట్టేది, అవి దెబ్బలు కావు.

''ఏంటి శీను, ఇప్పుడా నువ్వొచ్చేది? నేనెప్పు డొచ్చానో తెల్సా?''

''ఎప్పుడొచ్చావ్''

''దేవునికి మహా నివేదన అయినప్పటి నుంచి నేనిక్కడే వున్నాను''

''కడుపునిండా ప్రసాదం తిన్నావ్ కదా''

''అయితే మాత్రం''

''నేనసలు ఏం తినలేదు తెల్సా''

''నిజమా'' బాధ పడేది.

''నీమీదొట్టు! కావాలంటే నా కళ్ళు చూడు, ఎంత నీరసంగా ఉన్నాయో'' అనేవాణ్ణి. కస్తూరి దగ్గరగా వచ్చి నా కళ్ళలో కళ్ళు పెట్టి చూస్తుందని ఆశ! అయితే తనది గ్రహించేది. దగ్గరగా వచ్చేది కాదు. దూరంగా వుండే 'నీ సంగతి నాకు తెలుసు' అన్నట్టుగా చూసి–

''అయితే బాగా ఆకలిగా ఉందా?''అడిగేది.

''అవును'' అంటే నవ్వి, ఓ ముద్దు ఇచ్చేది. ఇవ్వడమే ఆలస్యం అక్కణ్నించి పరిగెత్తేది. అందు కుందామంటే అందేది కాదు. ఇప్పటికీ అంతే! కస్తూరి నాకు అందలేదు. దోసిట్లోని గన్నేరు పూలు స్వామి పాదాల మీద వుంచి, కూర్చున్నాను. అంతటా నిశ్శబ్దం! ఆ నిశ్శబ్దాన్ని తట్టుకోలేక పోతు న్నాను. భరించలేక పోతున్నాను. ఒకొక్కసారి నిశ్శబ్దం చాలా భయంకరంగా ఉంటుంది. నాన్న పోయినప్పుడు, అమ్మ పోయినప్పుడు కూడా ఇదే నిశ్శబ్దం! ఈ నిశ్శబ్దాన్ని అప్పుడు తట్టుకోలేకే పారి పోయాను. కస్తూరిని, అగ్రహారాన్ని వదిలేశాను.


అమ్మకి, నాన్నకీ ఇద్దరికీ సంగీతం బాగా



## సావిత్రికి అచ్చిరాని దర్శకత్వం

చిన్నారి పాపలు సినిమాతో దర్శకురాలయిన సావిత్రికి ఆ రంగంలో అభిమాన దర్శకులు ఎల్వీ ప్రసాద్, ఆదుర్తి సుబ్బారావు. చిన్నారిపాపలు సినిమాలో ఔట్‌డోర్ సన్నివేశాలన్నీ మద్రాసుకు 200 కిలోమీటర్ల దూరాన వున్న ఒగినికల్‌లో తీశారు. సేలంకు దగ్గరగా వుంటుందా ప్రాంతం. కావేరీనది ఒడ్డునవుండే ఆ ప్రాంతం చాలా బాగుంటుంది. సావిత్రి తన ప్రాప్తం (తెలుగు మూగ మనసులు) తమిళ సినిమాను కూడా కొంత భాగం అక్కడే తీసింది. అలనాటి నటుడు రామచంద్ర కాశ్యప చిన్నారి పాపలు సినిమాకు నిర్మాణసారథిగా పనిచేశారు. ఆయన, సావిత్రి మొదట్లో జ్యోతి అనే సినిమాలో పనిచేశారు. చిన్నారి పాపలు సినిమాకు ముందు చిన్నారి మనసులు అని పేరు పెట్టి ఆ తరువాత మనసు మార్చుకుని పాపలు చేశారు. చిన్నారి పాపలు సినిమాను తమిళంలో కుళందైవుళ్ళమ్ పేరిట తీశారు. అందులో జమున పాత్రను వాణిశ్రీ చేసింది. జానకి అక్కడ కూడా తన వేషం తనే వేసింది. సావిత్రి ఆ తరువాత చిరంజీవి, వింత సంసారంవంటి మరికొన్ని సినిమా లకు దర్శకత్వం చేసినా ఏవీ ఆడలేదు. ఆమె దర్శకత్వంలో విజయవంతమైన చిత్రం ఒక్కటే. మాతృదేవత. ఆ సినిమాలో ఆవిడ ఎంతో మనసుపడి రాయించుకున్న మానవజాతి మనుగడకే ప్రాణం పోసింది మగువ... పాట ఈనాటికీ సంగీత ప్రియుల నోట్లో తారాడుతూనే వుంటుంది.







వచ్చు. ఇద్దరూ ఒకే సంగీత కాలేజీలో చదువుకున్నారు. ఆ చదువుకున్న రోజుల్లోనే ఇద్దరూ పెళ్ళి చేసుకున్నారు. నాకు ఊహ తెలిసినప్పటి నుంచి మా వాకిలంతా సంగీతమే సంగీతం. అమ్మాయిలు, అబ్బాయిలు రెండు వరసల్లో కూర్చుని, అమ్మా నాన్న దగ్గర సంగీతం నేర్చుకునే వారు. ఉభయ సంధ్యలూ సంగీత ప్రవాహమే! నన్నూ కూర్చో పెట్టి నేర్చుకోమనే వారు. నేను నేర్చుకోలేదు గాని కూర్చున్నందుకుగాను సంగీతం అంటే 'ఇది' అన్నది నాకు బాగా తెలుసు. కస్తూరి కూడా నా గురించి ఇదే మాట అనేది. సంగీత పాఠాలు చెప్పి చెప్పి, పాడి పాడి నాన్న గొంతు అరిగిపోయి అలసి పోయిందేమో! ఒక రోజు నాన్న గొంతు లోంచి రక్తం పడింది. ఆస్పత్రిలో జాయిన్ చేశాం. కేన్సర్ అన్నారు డాక్టర్లు. ఇంట్లో సంగీత పాఠాలు లేవుగాని, అమ్మ ఏడుపు అన్ని వేళలా ఉండేది. ఓ చీకటి వేళ నాన్న పోయారు. ఆస్పత్రి నుంచి కబురొచ్చింది. అప్పుడు అమ్మ ఏడవ లేదు. మౌనంగా ఉండిపోయింది. నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దంలో చిత్రంగా వినవచ్చే బల్లి అరుపు కూడా వినరాలేదు.దాంతో ఎందుకనో చాలా భయపడ్డాను. ఆ నిశ్శబ్దాన్ని తట్టుకోలేకపోయాను. ఆ రోజుల్లోనే గలగలా నవ్వే కస్తూరి పరిచయం అయింది. సర్దుకున్నాను. తర్వాత అమ్మ ఒక్కతే సంగీత పాఠాలు చెప్పనారంభించింది. రాగాలు, కీర్తనలు.... ఇల్లు మళ్ళీ సందడిగా తయారైంది. ఆ సందడి వేళే కస్తూరి, నేనూ బాగా దగ్గరయ్యాం. అమ్మలేని సమయంలో హార్మోనీ వాయిస్తానంటూ వచ్చేది కస్తూరి. హార్మోనీ మెట్ల మీద కస్తూరి వేళ్ళతో పాటు నా వేళ్ళు కూడా కదలాడేవి. ఒకరి వేళ్ళను ఇంకొకరి వేళ్ళు వొరుసుకుంటూ నిమురుకుంటుంటే ఎంత ఆనందం?! ఆనందానికి అర్థం అంటూ ఉంటే, అదంటూ మనిషికి తెలిసేది పదహారు, పదిహేడేళ్ళ వయసులోనేనన్నది నాకప్పుడే తెలిసింది.

చిలకాకు పచ్చ పరికిణి, దాని మీద కుంకుమ రంగు జాకెట్టు-ఓణీ, తల్లో సంపెంగ పూలు, మెళ్ళో సన్నని గొలుసు, కళ్ళలో చల్లగా వెన్నెలంత వెలుగు.. కస్తూరి అందంగా ఆనందంగా వుండేది. గొలుసు గొలుసులుగా కస్తూరి నవ్వుతోంటే సప్త స్వరాలు ఆ నవ్వులో పలికేవి. అమ్మ సంగీతం ఆ నవ్వు ముందు బలాదూర్ అనిపించేది. ఒకసారి కస్తూరి అలా సంగీతంలా నవ్వుతోంటే ఆ నవ్వుని దోసిట పట్టాలని చేతుల్ని కస్తూరి ముఖాన ఉంచినప్పుడు....సరిగ్గా అప్పుడే కస్తూరి వాళ్ళ నాన్నమ్మ మా ఇంటికొచ్చింది. నా చేతులు కస్తూరి ముఖాన ఉండడాన్ని చూసి-

''ఏం చేస్తున్నావ్‌రా వెధవా నువ్వు! ఉండు! మీ అమ్మకి చెప్తాను''అంటూ అమ్మని కేకేసింది. అయితే అమ్మ ఇంట్లో లేకపోవడం నా అదృష్టం. ఆ రోజంటే నా అదృష్టం బాగుండి గండం గడిచి గట్టెక్కింది కాని, తర్వాత గట్టెక్క లేకపోయింది. ఒకానొక సాయంత్రం వేళ అమ్మవారి గుడి వెనుక నందివర్ధనం నీడలో నేను, కస్తూరి ఉన్నప్పుడు మళ్ళీ వాళ్ళ నాన్నమ్మ మమ్మల్ని చూసి చాలా గోల చేసింది.

''నెల తక్కువ వెధవ! తండ్రిని మింగిన చండాలుడా ! ఏం చేస్తున్నావ్‌రా? నా మనవరాల్ని పట్టుకుని ఇక్కడేం చేస్తున్నావ్'' అంటూ నన్ను నిలదీసింది.

''ప్రేమించుకుంటున్నాం'' అన్నాను.

''నీ బతుక్కి అదొక్కటే తక్కువ'' అని రాళ్ళతో నన్ను కొట్టి, కస్తూరిని వెంట పెట్టుకుని వెళ్ళిపోయింది. ఆ వెళ్ళడం వెళ్ళడం అమ్మ దగ్గరికి వెళ్ళింది.

''చూశావా నీ కొడుకేం చేస్తున్నాడో! నా మనవరాల్ని పాడు చేస్తున్నాడు'' అని గగ్గోలు పెట్టింది. ఆ మాటకి అమ్మకి కాళ్ళూ చేతులూ ఆడలేదు. భయంతో నోట మాట కూడా రాలేదు. మాట పడిపోయింది. మాటే కాదు ఆ దెబ్బకి అమ్మ మూలన కూడా పడిపోయింది. ఏడిస్తే 'వద్దురా! పెద్దవాళ్ళతో గొడవలొద్దు' అని సైగలు చేసి చెప్పింది. కస్తూరిని కలవొద్దని కూడా చెప్పింది. కలవకూడదనే అనుకున్నాను. కాని, కస్తూరిని కలవకుండా చూడకుండా ఉండలేక పోయాను. కలవాలని కస్తూరికి కబురు పెట్టాను. చూడాలని





మీ సెలవు రోజులనాడు మిమ్మల్ని ఓ విలక్షణ ప్రపంచంలో విహరింపచేసే గ్రామం!

ధోలారిధనిలో విస్తారంగా వ్యాపించి సూర్యరశ్మి స్పర్శతో పులకించే ఇసుక మైదానాలతో మిమ్మల్ని సమ్మోహపరచడమేకాదు రమ్యమైన ప్రకృతి దృశ్యాలు మిమ్మల్ని కనులార్పకుండా చేస్తాయి. అంతేకాక సంచార ఒంటెలు, తళుకుబెళుకుల వేషధారణతో రంగుల మయంచేసే సందర్శకులు, నాగదాస్, డోలకుల ధ్వని తరంగాలు, తినుబండారాలలో అత్యుత్తమ రకమైన సంప్రదాయక వంటకం ఘూమర్స్ వందే సుందరాంగులు, ఇంకా ఎన్నెన్నో కమనీయ దృశ్యాలు మీ కోసం నిరీక్షిస్తున్నాయి.

వివాహాలు, మతపర వేడుకలు, ఫిలిం షూటింగ్స్, కార్పొరేట్ సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, గెట్ టుగెదర్ లేదా సరదాగా షికారు చేయడం వీటిలో ఏదైనాసరే మీ జీవితంలో మధుర క్షణాలను మీకు అందిస్తాం.

రైల్వే స్టేషన్ / ఎయిర్‌పోర్ట్ నుంచి **11** కి.మీ.

Dhola-ri-Dhani
Rajasthani Village / Resort

ఆంధ్రప్రదేశ్‌లో రాజస్థాన్‌ను సందర్శించండి !

స్వామి : 9347049457 / 08418320909 / 040-27845991
సిటీ ఆఫీసు : 714, 7వ అంతస్తు, షెనాయ్‌ట్రేడ్ సెంటర్, పార్క్‌లేన్, సికింద్రాబాద్.
రిసార్ట్ : కొంపల్లి గ్రామం, మేడ్చల్ రోడ్, ఆర్.ఆర్.జిల్లా, ఆం.ప్ర.
**Website: www.dholaridhani.com**

ఉందన్నాను.

''అయితే సాయంత్రం చెరువు గట్టుకి రా'' కబురంపింది కస్తూరి. వెళ్ళానక్కడికి. అయితే అక్కడ కస్తూరి లేదు. వాళ్ళ నాన్నమ్మ , నాన్నా ఉన్నారు. నన్ను పట్టుకుని చితక్కొట్టారు. కస్తూరి వాళ్ళ నాన్న గారయితే నన్ను చెరువులో ముంచి తీశారు.

''చంపేస్తాను ఏమనుకున్నావో'' అన్నారు.

''అంత మాటెందుకు వదిలేయండి'' అక్కడి కొస్తూ పూజారి గారు కల్పించుకున్నారు.

''ఈ వెధవ సంగతి మీకు తెలీదు పూజారి గారు'' నాన్నమ్మ గొంతు చించుకుంది.

''నాకంతా తెలుసమ్మా! మీ మనవరాలితో ఈ కుర్రాణ్ని శివాలయంలో చాలా సార్లు చూశాను! తండ్రి లేని పిల్లాడు! జాలిపడి వదిలేయండి'' అన్నారు పూజారి గారు.

''అయితే మీకూ ఈ కథంతా తెలుసన్న మాట'' పూజారి గారితో అని–

''వదలకురా! ఆ వెధవని అసలొదలకు ! చెమ్డాలూడదీసేయ్'' కొడుక్కి చెప్పింది నాన్నమ్మ. తల్లి మాట కాదనలేదు కొడుకు. ఆమె చెప్పినట్టే చేస్తున్నాడు. నన్ను నిలువునా పాతేస్తున్నాడు. దెబ్బలకి తట్టుకోలేక ఏడుస్తున్నాను నేను. నన్ను చూస్తే పూజారి గారికి జాలేసిందేమో!

''ఈ కుర్రాడి తరుపున నేను క్షమాపణ చెబుతున్నాను!వదిలేయండి! నా మాట వినండి'' అని పూజారి గారు చేతులెత్తి దణ్ణం పెడితే అప్పటికి శాంతించి నన్నొదిలేశారు. వాళ్ళు వదలడమే ఆలస్యం, నన్ను పట్టుకుని పూజారి గారు గబాగబా వాళ్ళకి దూరంగా నాలుగు అడుగులు వేసి, ఆయాసపడుతూ ఆగి–

''పోరా! అమ్మని తీసుకుని అగ్రహారానికి దూరంగా పారిపో! లేకపోతే నిన్ను వాళ్ల బతకనివ్వరు'' అన్నారు. తన పట్టులోంచి నన్ను తప్పించారు. పరిగెత్తేందుకు శక్తి లేదు. అయినా ప్రయత్నించాను. పరుగులాంటి నడక అయ్యిందది. ఇంటికి చేరాను. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. అమ్మని చూశాను. నిశ్చేష్టగా వుంది. అమ్మ కళ్ళల్లోకి చూశాను. నిస్తేజంగా ఉన్నాయవి. అమ్మ చనిపోయింది. 'గొల్లు'మన్నాను. నా ఏడుపు ఆ నిశ్శబ్దంలో నాకే జాలిజాలిగా వినవచ్చింది. బస్సు చక్రాల కింద పడి నలుగుతున్న కుక్కపిల్ల ఏడుపులా వుంది నా ఏడుపు. చిన్నప్పుడెప్పుడో చూశాను ఆ దృశ్యాన్ని. అదిప్పుడు గుర్తొచ్చింది. తట్టుకోలేక పోయాను.

''ఎందుకయ్యా ఆడవాళ్ళ ఉసురు పోసుకుంటావ్? నీ వల్ల చూడేం జరిగిందో! నీ కోసం చెరువు గట్టు మీద నిలబడి పాపం ఆ కస్తూరి వాళ్ళ నాన్న చేతిలో తినరాని దెబ్బలు తింది. 'ఇంటికి పో' అని కసిరితే పోయింది.మీ అమ్మకేమో నువ్వా చెరువు గట్టున దెబ్బలు తింటున్నావని తెలిసి, స్పృహ పోయింది. తర్వాత ప్రాణమే పోయింది'' ఏడుస్తూ ముత్తయిదువెవరో చెప్పారు. చెరువు గట్టున జరిగింది, తర్వాత మా ఇంట్లో జరిగిందంతా ఆవిడకి బాగా తెలిసినట్టుగా ఉంది.

''అమ్మని పట్టుకుని ఏడవడం కాదు, ముందు జరగాల్సింది చూడు'' చెప్పిందావిడ. జరగాల్సిందంటే? అమ్మ దహనం జరగాలి. అందు కోసం స్నేహితులను ఆశ్రయించాను. దీక్షితులు, శాస్త్రి, పతంజలి కలసికట్టుగా వచ్చారు. వాళ్ళ తల్లి దండ్రులు, నన్ను కలవకూడదని ఆంక్షలు పెట్టినా ఖాతర్ చెయ్యలేదు వాళ్ళు. కాణీ పరకా పోగేసి, ఎలాగయితేనేం అమ్మని దహనం చేసేశాం. మంటల్లో అమ్మ, వాయులీనంలా కాలి బూడిదయిపోయింది. ఆ రాత్రే అగ్రహారంతో బంధాలు తెంచుకుందామనిపించి, ఆఖరిసారిగా కస్తూరిని కలవాలనుకున్నాను. ఆ మాటే దీక్షితులికి చెప్పి, కస్తూరిని ఎలాగైనా శివాలయంలో కలుసుకోమని చెప్పమన్నాను.

''నిన్ను కలుసుకోమని, నేను చెప్పినట్టుగా కస్తూరి వాళ్ళ నాన్న గారికి తెలిసిందనుకో లేనిపోని గొడవ! వద్దులేరా''అన్నాడు దీక్షితులు.

''మళ్ళీ కస్తూరిని చూస్తానో లేదో! ప్లీజ్‌రా''అన్నాను. బతిమలాడాను. 'సరే' అని బయల్దేరాడు దీక్షితులు.అంతలో వాళ్ళ అమ్మకి తెలీకుండా రెండు చల్లట్లు విస్తరాకులో చుట్టి, తెచ్చాడు పతంజలి.

''నీ కోసం మరొరెండు తెద్దామనుకున్నానా! కాని, నేను రెండు అట్లు కన్నా ఎక్కువ తిన్లేను! ఆ సంగతి అమ్మకి బాగా తెలుసు!అమ్మని మరొరెండు అడిగాననుకో తనకి అనుమానం వచ్చి మొదటికే మోసం వస్తుందని...''అంటూ క న్నీళ్ళు పెట్టుకున్న పతంజలిని చూస్తే నాకూ ఏడుపు వచ్చింది. నేనేడుస్తోంటే–

''వద్దురా! నువ్వేడవకు'' అని నా కన్నీళ్ళు తుడిచాడు పతంజలి. తర్వాత ''తిన్రా! తొందరగా తిను'' అని తొందర చేసి, వాడు తెచ్చిన అట్లు నా చేత తినిపించి, ''పద''అంటూ నన్ను శివాలయానికి బయల్దేరదీశాడు.

రాత్రి తొమ్మిది గంటల వేళ. కుమార స్వామి ఆలయంలో చిన్న చేసంచితో నేను, కుక్కలకి భయపడుతూ చేతిలో చిన్న రాయితో పతంజలీ నిల్చుని ఉన్నాం. కస్తూరిని దీక్షితులు తీసుకొస్తున్నాడు. తీసుకొస్తున్నట్టుగా కబురు చేశాడు. వాళ్ళొస్తే వాళ్ళనోసారి చూసి, నేను అగ్రహారం రోడ్డు రైల్వే స్టేషన్‌కి పరిగెత్తాలి. అక్కడ రాత్రి పద కొండింటికి పాసింజరు బండి ఉంది. దాన్ని అందుకుంటే ఇక అంతే సంగతులు! అగ్రహారాన్ని వదిలేసినట్టే! కస్తూరిని కూడా వదిలేయాలా? ఆలోచిస్తున్నాను. కస్తూరి వస్తానంటే? కూడా తీసుకెళ్ళాలా? వద్దా? తీసుకెళ్తే ఎక్కడుంటాం? ఎలా బతుకుతాం? ఎలాగోలా బతుకుతాం అనుకుంటే కస్తూరి నాన్న, నాన్నమ్మ మమ్మల్ని బతకనిస్తారా? అని. నాకంతా పిచ్చిగా ఉంది. ఆ సమయంలో–

''అన్నట్టు అడగడం మరిచిపోయాను. ఊరొదిలి పారిపోతున్నావు కదా! ఎక్కడికి పారిపోతున్నావురా? ఏ ఊరికెళ్తున్నావు'' అడిగాడు పతంజలి. సమాధానం ఏ ఊరికని చెప్పను? ఎక్కడికి వెళ్తున్నానో నాకే తెలీదు. ఆ సంగతే చెప్పాను వాడికి. బాధ పడ్డాడు. అ బాధతో చేతిలోని రాయిని కసిదీరా విసిరేశాడు. ఆ క్షణం వాడికి, కుక్కలంటే భయం పోయిందేమో! తుప్పల్లో రాయి పడి చేసిన అలజడికి వస్తూ భయపడ్డారేమో!

''ఎవరూ? శీనూ!'' అరిచాడు దీక్షితులు.

''ఒరేయ్! దీక్షితులురా'' దీక్షితులు వస్తున్న సంగతి చెప్పాడు పతంజలి.

''అవునవును'' ఆనందపడ్డాను. కస్తూరితో పాటుగా వచ్చాడు దీక్షితులు. నన్ను చూస్తూనే 'శీనూ' అంటూ నన్ను అల్లుకుపోయింది కస్తూరి. మమ్మల్ని అలా చూడ్డం ఇబ్బందనిపించి, '' మీరు మాట్లాడుకుంటూ ఉండండి! మేము ఆ మూల ఉంటాం'' అని వెళ్ళిపోయారు పతంజలి, దీక్షితులు.

''నేనూ నీతో పాటే వచ్చేస్తాను శీనూ'' ఇందాక నేనాలోచించినట్టుగానే అంది కస్తూరి.

''ఎక్కడికి'' అడిగాను.

''నువ్వెక్కడికెళ్తే అక్కడికి'' అంది.

''వద్దు కస్తూరి! చచ్చిపోతాం'' అన్నాను.

''చచ్చిపోతే ఇద్దరం కలిసే చచ్చిపోతాంగా''



## పిబ్స్ రికార్డు!

అపోలో 11 చంద్రమండలంలో దిగిన సందర్భాన్ని పురస్కరించుకుని గాయకుడు పి.బి.శ్రీనివాస్ 1970 మే లో ఒక గ్రామఫోను రికార్డు విడుదల చేశారు. పెళ్లిరోజు చిత్ర నిర్మాత, సంగీత దర్శకుడు శ్రీరాం సంగీత దర్శకత్వంలో విడుదలయిన ఆ రికార్డులో ఒక వైపు మాన్ టూ మూన్ పేరిట, రెండో వైపు మూన్ టూ గాడ్ పేరిట పాటలు వున్నాయి. శ్రీనివాస్‌తోపాటు ఎస్. జానకి కూడా గాత్ర సహకారం అందించారు. పిబ్స్ పేరిట స్వయంగా శ్రీనివాసే ఈ పాటలు రాశారు. ఆర్కెస్ట్రా కండక్టింగ్ ఎ.ఎ.రాజ్ చూసుకున్నారు. తమిళనాడుకు ఆనాడు వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగావున్న నెడుంజెళియన్ ఈ రికార్డును విడుదల చేశారు. ఆయన కూడా సినిమా మనిషే. అశోకా హోటల్లో జరిగిన ఆనాటి సభలో తమిళ నటుడు రంజన్ (చంద్రలేఖ) ప్రార్థనాగీతం పాడారు.

అంది.

''కాని చచ్చిపోవడం నాకిష్టం లేదు'' అన్నాను.

''మరెలా శీను''

''నువిక్కడే ఉండు! నేనొస్తాను'' అన్నాను.

''నిజంగా వస్తావా''అడిగింది.

''ఎందుకు రాను'' అని కస్తూరిని, ''వస్తా౯నా'' అని చెప్పి, పతంజలి, దీక్షితుల్ని- ఆ తర్వాత అగ్రహారాన్ని వదిలేసి, ఆ రాత్రి పారిపోయాను. పాతికేళ్ళ నాటి సంఘటన ఇది. ఇన్నాళ్ళకి మళ్ళీ వచ్చాను. మధ్యలో వచ్చేవాణ్ణే! కాని రాలేక పోయాను. ఎందుకు రాలేదంటే-

మా ఇల్లు పడిపోయిందని తెలిసింది. కస్తూరికి పెళ్ళయిపోయిందని తెలిసింది. దాంతో అగ్రహారానికి రావడం అనవసరం అనుకున్నాను. అయినా ఎందుకో ఇన్నేళ్ళ తర్వాత అగ్రహారాన్ని చూడాలనిపించడంతో వచ్చానిక్కడికి. గతంలో బతకడం ఇష్టం లేకపోయినా గమ్మత్తుగా ఉంటుందని వచ్చాను.

సందడి సందడిగా ఉందంతా. అలయానికి ఇప్పుడిప్పుడే భక్తులొస్తున్నారు. శివాలయంలో గంటలు మోగుతున్నాయి. మెట్ల మీద పిల్లలు జారిపడుతూ ఏడుపులంకించుకుంటున్నారు. కోనేట్లో ఈతలు, అమ్మవారి గుళ్ళో కుంకుమార్చనలూ అన్నీ వినవస్తున్నాయి. కుమార స్వామిని వదిలి ముందుకి నడిచాను. లెక్క ప్రకారం ముందు శివయ్యని దర్శించుకోవాలి. కాని, నాకెందుకో ముందు అమ్మవారిని చూడాలనిపించి అటుగా నడిచాను. గుళ్ళోకి వచ్చానో లేదో! చిలకాకు పచ్చ పరికిణీ కట్టుకుని, దాని మీద కుంకుమ రంగు జాకెట్టు, ఓణీ వేసుకుని, తల్లో సంపెంగ పూవ్వులు, మెళ్ళో సన్నని గొలుసు పెట్టుకుని, కళ్ళలో చల్లగా వెన్నెలంత వెలుగుతో... కస్తూరి! కాదు కాదు! అచ్చం కస్తూరిలా ఉన్న అమ్మాయి గుప్పెట కుంకుమతో వచ్చి-

''అమ్మవారి కుంకుమ !తీసుకోండి! బొట్టు పెట్టుకోండి'' అంది. ఆశ్చర్యంగా ఆనందంగా ఆ అమ్మాయిని చూస్తూ ఆమె చేతిలోని కుంకుమ తీసుకుని నుదుటన బొట్టు పెట్టుకున్నాను.

''నీ పేరేంటమ్మా'' అడిగాను.

''రాక్షసి''అని నవ్వింది.

''అది నా ముద్దు పేరు. నా అసలు పేరు కాంతం'' అంది ఆ అమ్మాయి. ఆ పేరు నాకు బాగా తెలుసు! కస్తూరి వాళ్ళ నాన్నమ్మ పేరు అదే! అంతలో ''ఇదిగో''అంటూ మా దగ్గరికి వచ్చింది కస్తూరి. ''రారా! నిన్ను నాన్న గారు రమ్మంటున్నారు'' అంది. నా వైపు కస్తూరి చూడను కూడా చూడలేదు. తను చూస్తుందని నేనూ ముఖం తిప్పుకున్నాను.

''ఆయన రమ్మంటే వచ్చేయాలా? అగ్రహారంలో కూడా ఆయన్దేనా అజమాయిషీ! నోనో! నేనొప్పుకోను! ఈ అగ్రహారం నాది! ఇక్కడ నా మాటే చెల్లాలి! చెప్పమ్మా! ఈ మాట నా మాటగా మీ ఆయనికి చెప్పు'' అంది కాంతం. దానికి ''రాక్షసి'' అంటూ కాంతం చెవి మెలి పెట్టింది కస్తూరి. 'అమ్మా అమ్మా' అంటూ కాంతం బతిమాలుతున్నా చెవిని వదిలిపెట్టక కాంతాన్ని లాక్కెళ్ళిపోయింది కస్తూరి. వాళ్ళాయన దగ్గరగా కూతురిని తీసుకెళ్ళింది. పున్నాగ చెట్టు నీడలో నిల్చుని ఉన్నాడు కస్తూరి భర్త. ఆ భర్త ఎవరో కాదు! మా దీక్షితులే!! బాగా మారిపోయాడు!!! కస్తూరి, కాంతం, దీక్షితులూ ముచ్చటగా ముగ్గురూ భేషుగ్గా ఉన్నారనిపించింది. ఇంకా ఎక్కువ సేపు అక్కడ ఉండడం మంచిది కాదనిపించి, వెనుతిరిగాను. జీవితం అన్నాక చాలా జరుగుతాయి. కష్టాలు, సుఖాలు, విషాదాలు, వినోదాలు... ఎన్నెన్నో!!

**అసలు సంగతి... వాళ్ళ నాన్నమ్మ పుణ్యమా అని కస్తూరి, దీక్షితులూ ఒక్కటయ్యారట! అందుకే కూతురికి కావాలని నాన్నమ్మ పేరు పెట్టుకున్నాడు దీక్షితులు. కస్తూరిని ప్రేమించడమే నాకు తెలుసు! అనుభవించడం దీక్షితులుకు తెలుసు!!**

★

